క్లుప్తంగా

వీధిలైట్లకు మరమ్మతు

బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలోని బుచ్చి నాయుడుకండ్రిగ గ్రామంలో వీధిలైట్లను సర్పంచ్ వెంకటమ్మ, గ్రామ కార్యదర్శి ఇందిరమ్మ, ఉపసర్పంచ్ మునిరాజా ఆధ్వర్యంలో మరమ్మతులు చేయించారు. వెలగని వీధిలైట్లను తొలగించి, కొత్తవి అమర్చారు. వీధి లైట్లకు మరమ్మతులు చేయడంపై గ్రామస్తులు సంతోషం వ్యక్తం చేశారు.

ముక్కంటి సేవలో అవనిగడ్డ ఎమ్మెల్యే


ఆలయ ధ్వజస్తంభం వద్ద ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్

శ్రీకాళహస్తి: జ్ఞానప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వరస్వామివారిని ఆదివారం అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. దక్షిణ గోపురం వద్ద ఆలయాధికారులు వారికి స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. దర్శనానంతరం గురుదక్షిణామూర్తి సన్నిధి వద్ద ఆలయ వేదపండితులు ఆశీర్వదించి స్వామి అమ్మవార్ల జ్ఞాపిక, తీర్థప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయాధికారులు తదితరులు పాల్గొన్నారు.

అనుమతి లేకుండా తుడా బంగ్లా స్వాధీనం

తిరుపతి తుడా: తిరుపతి పట్టణాభివృద్ధి సంస్థ (తుడా)కు సంబంధించిన అతిథి గృహాన్ని ముందస్తు సమాచారం ఇవ్వకుండా, ఎలాంటి అనుమతులు తీసుకోకుండా మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ పేరుతో స్వాధీనం చేసుకున్నారు. ఈ వ్యవహారం ఇప్పుడు వివాదాస్పదంగా మారింది. తుడా అధికారులకు చెప్పకుండా మున్సిపల్ కార్పొరేషన్ సిబ్బంది బంగ్లాను తెరవడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. అక్కడ తుడా వీసీకి సంబంధించిన నేమ్ బోర్డు, ఫర్నిచర్‌ను సైతం దౌర్జన్యంగా బయట పడేశారు. తమకు ఎలాంటి సమాచారం లేదని బంగ్లా అప్పగించాలంటే కనీసం కలెక్టర్ అనుమతి అయినా కావాలని తుడా అధికారులు మొరపెట్టుకున్నా పట్టించుకునేవారు కరువయ్యారు. ఈ విషయాన్ని కమిషనర్ సీసీ దృష్టికి తీసుకెళ్లగా, ఆయన మరో విధంగా కలెక్టర్‌కు సమాచారం అందించడంతో వివాదం ముదిరింది.

ప్లాస్టిక్ రహిత సమాజమే లక్ష్యం


ప్లాస్టిక్ వ్యర్థాలను తొలగిస్తున్న రోటరీ క్లబ్ సభ్యులతో రిజిస్ట్రార్ తదితరులు

తిరుపతి సిటీ : ప్లాస్టిక్ రహిత సమాజమే లక్ష్యంగా ఎస్వీయూలో క్లీన్ క్యాంపస్–గ్రీన్ క్యాంపస్ కార్యక్రమం నిర్వహించనున్నట్లు రిజిస్ట్రార్ ప్రొఫెసర్ భూపతి నాయుడు తెలిపారు. ఆదివారం వర్సిటీలో ప్లాస్టిక్ వ్యర్థాలను తొలగిస్తున్న రోటరీ క్లబ్ స్వచ్ఛంద సేవకులను ఆయన అభినందించారు. ఈ సందర్భంగా రిజిస్ట్రార్ మాట్లాడుతూ ప్లాస్టిక్ రహిత సమాజం కోసం యువత కృషి చేయాలని పిలుపునిచ్చారు. ప్లాస్టిక్ కాలుష్యం మానవాళికి, వన్య ప్రాణులకు అత్యంత ప్రమాదకరమని తెలిపారు. పర్యావరణ వ్యవస్థకు ప్లాస్టిక్ కారణంగా తీవ్రనష్టం వాటిల్లుతుందన్నారు. వర్సిటీలో విద్యార్థులతో వలంటీర్ల బృందాలను ఏర్పాటు చేసి క్లీన్ క్యాంపస్, గ్రీన్ క్యాంపస్ కార్యక్రమాన్ని చేపడతామని వెల్లడించారు. కార్యక్రమంలో రోటరీ క్లబ్ మాజీ అధ్యక్షుడు జయరామ్ ప్రసాద్, సభ్యులు శివాజీ, నాగోతు హరికృష్ణ, స్వచ్ఛంద సేవకులు మార్కండేయ, ధరణి పాల్గొన్నారు.

తైక్వాండో టోర్నీ ప్రారంభం

తిరుపతి సిటీ : సంస్కృత విశ్వవిద్యాలయంలో ఆదివారం జిల్లా తైక్వాండో చాంపియన్‌షిప్ టోర్నమెంట్ ప్రారంభించారు. జిల్లా తైక్వాండో అసోసియేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు చంద్రశేఖర్, డీఎస్‌డీఓ షేక్ సయ్యద్ మాట్లాడుతూ విద్యార్థులకు చదువుతోపాటు క్రీడలు కూడా అవసరమేనన్నారు. ఆ దిశగా దృష్టి సారించి రాణించాలని సూచించారు. శారీరక దృఢత్వానికి, మానసిక ఉల్లాసానికి క్రీడలు దోహదపడతాయని వెల్లడించారు.

మధుమేహ నియంత్రణకు 'ఆయుష్'

తిరుపతి తుడా: ప్రపంచాన్ని వణికిస్తున్న మధుమేహ వ్యాధి నియంత్రణలో ఆయుష్ వైద్యం కీలక పాత్ర పోషిస్తోందని వీజే ఆస్పత్రి అధినేత డాక్టర్ జ్యోతి కుమార్ తెలిపారు. ఆదివారం నగరంలోని ఓ ప్రైవేట్ హోటల్‌లో ఆయుష్ వైద్య ప్రక్రియ ప్రాముఖ్యతపై సెమినార్ నిర్వహించారు. ఉమ్మడి జిల్లా నుంచి ఆయుష్ వైద్యులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. జ్యోతి కుమార్ మాట్లాడుతూ ఆయుష్ వైద్యంతో దీర్ఘకాలిక సమస్యలకు చెక్ పెట్టవచ్చన్నారు. ముఖ్యంగా మధుమేహం సమస్యను అధిగమించేందుకు ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. ఏబీసీడీ అనే వైద్య సలహాలతో మధుమేహాన్ని పూర్తిగా నిర్మూలించవచ్చని చెప్పారు. ప్రపంచవ్యాప్తంగా ఆయుష్ వైద్యానికి ప్రాధాన్యత పెరుగుతోందని స్పష్టం చేశారు.

ప్రోత్సాహం.. బహుదూరం

పేదింట ప్రతిభావంతులకు ప్రోత్సాహం.. ఉన్నత విద్యకు మార్గం సుగమం.. ఇందుకు వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో జగనన్న ఆణిముత్యాల పేరిట ఆదరణ.. వెరసి పేద విద్యార్థుల్లో ఉత్సాహం, ఉత్తేజం..పేదింటి బిడ్డలు పైచదువులకు, ఉజ్వల భవితకు సోపానం పడేది. అయితే మారిన ప్రభుత్వం.. జాడలేని ప్రోత్సాహంతో ఇక బహుదూరమేనని ప్రతిభావంతుల ఆవేదన చెందుతున్నారు.

- వైఎస్సార్‌సీపీ హయాంలో ప్రతిభావంతులకు ప్రోత్సాహకాలు
- రాష్ట్ర, జిల్లా, నియోజకవర్గ స్థాయిలో బహుమతులు
- ఈ ఏడాది ఆ దిశగా చర్యలు తీసుకోని ప్రభుత్వం
- బహుమతులు ఇస్తుందో లేదో స్పష్టత కరువు


కేవీబీపురంలో విద్యార్థులకు ప్రోత్సాహం అందించి, సత్కరిస్తున్న ఎమ్మెల్యే ఆదిమూలం(ఫైల్)

వరదయ్యపాళెం: ప్రతి పేద, మధ్య తరగతి విద్యార్థులకు కార్పొరేట్ స్థాయి విద్యను అందించాలనే ఉద్దేశంతో ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకుని పదో తరగతి, ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్ష ఫలితాల్లో ప్రతిభ చాటిన విద్యార్థులను ప్రోత్సహించేందుకు జగనన్న ఆణిముత్యాలు (స్టేట్ బ్రిలియన్స్ అవార్డ్స్) పేరిట నగదు ప్రోత్సాహక బహుమతులను అందించి సత్కరించింది. అయితే ప్రస్తుతం అధికారం చేపట్టిన కూటమి ప్రభుత్వం విద్యార్థులను ప్రోత్సహించడానికి ఎలాంటి నిర్ణయం తీసుకోలేదు. దీంతో గత విద్యా సంవత్సరం 2023–24లో ప్రతిభ చూపిన విద్యార్థులకు ప్రోత్సాహక బహుమతులు లేనట్లేనని పలువురు అభిప్రాయపడుతున్నారు.

వివిధ స్థాయిలో ప్రోత్సాహకాలు

ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలల్లో చదువుకున్న విద్యార్థుల ఫలితాలను మెరుగుపరిచి వారిని ప్రోత్సహించేలా గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ప్రోత్సాహక బహుమతులను అందించారు. పదో తరగతి పరీక్షల్లో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులను నియోజకవర్గ, జిల్లా రాష్ట్రస్థాయిల వారీగా ఎంపిక చేసి నగదు బహుమతులను అందించారు. పదో తరగతితోపాటు ఇంటర్మీడియట్‌లో ఎంపీసీ, బైపీసీ, హెచ్‌ఈసీ, సీఈసీ, ఎంఈసీ తదితర గ్రూపుల వారీగా అత్యధిక మార్కులు సాధించిన వారిని ఎంపిక చేసి ప్రోత్సాహకాలను అందించారు. పదో తరగతిలో రాష్ట్రస్థాయిలో మొదటి స్థానం సాధించిన వారికి రూ.లక్ష, రెండో స్థానం వారికి రూ.75 వేలు, మూడో స్థానం సాధించిన వారికి రూ. 50వేలు అందించారు. ఇంటర్మీడియట్‌లో గ్రూపునకు ఒక్కరు చొప్పున ప్రతిభ చాటిన వారికి రూ.లక్ష అందించారు. జిల్లా స్థాయిలో అయితే పదో తరగతిలో మొదటి స్థానం సాధించిన వారికి రూ. 50 వేలు, రెండో స్థానం సాధించిన వారికి రూ. 30 వేలు, మూడో స్థానం వారికి రూ. 15వేలు అందజేశారు. ఇంటర్మీడియట్ విద్యార్థులకు గ్రూపునకు ఒక్కరిని ఎంపిక చేసి అందులో ప్రతిభ చాటిన వారికి ఒక్కొక్కరికీ రూ. 50వేలు అందించి ప్రోత్సహించారు. అలాగే నియోజకవర్గ స్థాయిలో పదో తరగతిలో మొదటి మూడు స్థానాల్లో నిలిచిన వారికి రూ. 15వేలు, రూ. 10వేలు, రూ. 5వేలు అందజేశారు. ఇంటర్‌లో టాపర్‌గా నిలిచిన వారికి రూ. 15వేలు ప్రోత్సాహకంగా అందజేసి సత్కరించారు.

ఈ ఏడాది ప్రోత్సాహకాలు లేనట్లే

ప్రస్తుతం అధికారం చేపట్టిన కూటమి ప్రభుత్వం విద్యార్థులకు ప్రోత్సాహకాలు అందించడానికి ఇప్పటివరకు ఎలాంటి నిర్ణయాలు తీసుకోలేదు. కనుక ఈ ఏడాది ప్రోత్సాహక బహుమతులు లేనట్లేనని పలువురు అభిప్రాయపడుతున్నారు.

ఉత్తమ ప్రతిభ చాటిన విద్యార్థులు

గత విద్యా సంవత్సరం (2023–24)లో సత్యవేడు నియోజకవర్గానికి సంబంధించి పదో తరగతి, ఇంటర్ ఫలితాల్లో పలు విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించి తమ ప్రతిభను కనబరిచారు. వరదయ్యపాళెం మండలంలో పదో తరగతి ఫలితాల్లో బి. పళవి (589), ఆర్. కస్తూరి (572), పూర్ణవందన (587), ఎం. హారిక (586), ఆర్. వర్షితశ్రీ (584), ఎస్. పోషిత (579), డి. యాషిని (583), డి. కీర్తన (578), పిచ్చాటూరు మండలంలో కె. చారుమతి (590), సోమశేఖర్ (579), జ్యోత్స్న (579), నారాయణవనం మండలంలో కస్తూరి (590), సోనియా (581), కుసుమాంజలి (585), కిషోర్ (581), సత్యవేడు మండలంలో ఎస్. వనిత (575) మార్కులు సాధించి ప్రతిభ చాటారు.

పోటీతత్వం పెరుగుతుంది



ప్రతిభ చాటిన విద్యార్థులను సత్కరించి అవార్డులను అందజేయడంతో విద్యార్థుల్లో కూడా పోటీతత్వం పెరుగుతుంది. విద్యార్థులు అంతకంటే ఎక్కువ మార్కులను సాధించాలని పట్టుదలతో చదువుతారు. మనం అందించేది చిన్న సాయమే అయినా విద్యార్థులకు అది ఎంతో సంతృప్తినిస్తుంది. ప్రభుత్వం బహుమతులను అందించి ప్రోత్సహించడం ఎంతో మంచిది. – రమణయ్య, హెచ్‌ఎం, వరదయ్యపాళెం హైస్కూల్

ప్రోత్సాహక బహుమతులు అందించాలి



పదో తరగతి, ఇంటర్మీడియట్ పరీక్షా ఫలితాల్లో ప్రతిభ చాటిన విద్యార్థులకు ప్రోత్సాహక బహుమతులను అందించాలి. గత ప్రభుత్వం ప్రతిభ చాటిన విద్యార్థులకు ప్రోత్సాహకాలతో సత్కరించింది. అందులో తమ కళాశాలకు చెందిన సీఈసీ విద్యార్థిని ప్రోత్సాహక బహుమతిని అందుకుంది. ప్రస్తుత ప్రభుత్వం ప్రోత్సాహక బహుమతులను అందిస్తుందో లేదో తెలియదు. ప్రతిభ కలిగిన విద్యార్థులకు ప్రభుత్వం అందించే ప్రోత్సాహకం ఎంతగానో ఉపయోగపడుతుంది. – పద్మావతి, ప్రిన్సిపాల్, జూనియర్ కళాశాల, వరదయ్యపాళెం

గత ఏడాది ప్రోత్సాహక బహుమతి అందుకున్నా



గత జగనన్న ప్రభుత్వంలో విద్యార్థులను ప్రోత్సహించేందుకు ప్రవేశపెట్టిన ఆణిముత్యం పథకం ద్వారా ఉత్తమ విద్యార్థినిగా ప్రోత్సాహక బహుమతి అందుకున్నాను. సీఈసీ గ్రూపులో ఉత్తమ మార్కులు సాధించిన నాకు రూ. 15వేలు ప్రోత్సాహక బహుమతిని అందించింది. నా విద్యార్థి జీవితంలో ఈ ప్రోత్సాహక బహుమతి ఉన్నత చదువుల్లో ప్రతిభ కనబరిచేందుకు ఎంతగానో దోహదపడుతుంది. – సుశీల్ల, వరదయ్యపాళెం జూనియర్ కళాశాల, పూర్వ విద్యార్థి

నేడు ఆడికృత్తిక

శ్రీకాళహస్తి: విజ్ఞానగిరిపై ఉన్న శ్రీవల్లి, దేవసేన సమేత కుమారస్వామి ఆలయంలో సోమవారం ఆడికృత్తిక మహోత్సవం జరగనుంది. ఈ నేపథ్యంలో భక్తులు అధిక సంఖ్యలో రానున్న నేపథ్యంలో ఆలయాధికారులు కట్టుదిట్టమైన చర్యలు తీసుకున్నారు. ఉదయం నుంచి రాత్రి వరకు శ్రీకాళహస్తి, పరిసర ప్రాంతాల నుంచి భక్తులు పెద్దసంఖ్యలో రానున్నారు. క్యూలు ఏర్పాటు చేశారు. ఇక ఉదయం 9 గంటలకు స్వామి అమ్మవార్లు ఇంద్ర విమానం, రాత్రి మయూర వాహనంపై విహరించనున్నారు.

టీచ్‌టూల్ అబ్జర్వర్‌గా సుబ్రమణ్యం


నియామక పత్రాన్ని అందజేస్తున్న ప్రధానోపాధ్యాయుడు నిర్మల్‌కుమార్

ఏర్పేడు: మండలంలోని బండారుపల్లి జెడ్పీ హైస్కూలులో ఆంగ్ల ఉపాధ్యాయుడిగా విధులు నిర్వహిస్తున్న సుబ్రమణ్యం టీచ్ టూల్ మండల అబ్జర్వర్‌గా నియమిస్తూ డీఈఓ శేఖర్ ఉత్తర్వులు జారీ చేశారని ప్రధానోపాధ్యాయుడు నిర్మల్‌కుమార్ తెలిపారు. ఈయన నెలకు నాలుగు సార్లు ఉపాధ్యాయుల బోధన తీరును పరిశీలించి ఆన్‌లైన్‌లో నివేదికలు సమర్పించనున్నట్లు తెలిపారు. సుబ్రమణ్యం నియామకంపై సహచర ఉపాధ్యాయులు గుణశేఖర్‌రెడ్డి, ద్వారకానాద్ రెడ్డి, కుమార్‌రాజు, ఉమామహేశ్వర్, సురేష్‌బాబు, రాధాకుమారి హర్షం వ్యక్తం చేశారు.

హెల్పింగ్‌హ్యాండ్స్ సేవలు ప్రశంసనీయం


నిత్యావసర సరుకులు అందజేస్తున్న గరికపాటి రమేష్‌బాబు, స్వర్ణమూర్తి

శ్రీకాళహస్తి: హెల్పింగ్‌హ్యాండ్స్ సేవలు ప్రశంసనీయమని బీజేపీ నాయకులు గరికపాటి రమేష్‌బాబు, ఏడుగంగమ్మల జాతర కమిటీ అధ్యక్షులు స్వర్ణమూర్తి అన్నారు. పట్టణంలోని హెల్పింగ్‌హ్యాండ్స్ కార్యాలయం వద్ద సంస్థ నిర్వాహకుడు మునీర్‌బాషా ఆధ్వర్యంలో వృద్ధులు, దివ్యాంగులకు నిత్యావసర సరుకులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 151 నెలలుగా ప్రతి నెలా పేదలకు నిత్యావసర సరుకులు పంపిణీ చేయడం సంతోషకరమన్నారు. మునీర్‌బాషా సేవలను గుర్తించిన ఓ ప్రముఖ చానల్ వారు ఎక్సలెన్సీ అవార్డు ప్రకటించడం పట్టణ వాసులుగా తమకు చాలా ఆనందంగా ఉందని తెలిపారు. ఆగస్టు 4వ తేదీన యువతరం సేవాసమితి ఆధ్వర్యంలో మునీర్‌బాషాకు సన్మాన కార్యక్రమం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంస్థ సభ్యులు హరినాయుడు, బాబా ఫరీద్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరానికి విశేషస్పందన


రోగులకు పరీక్షలు చేస్తున్న వైద్యులు

బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలోని బుచ్చినాయుడుకండ్రిగ గ్రామంలోని జెడ్పీ ఉన్నత పాఠశాల ఆవరణలో ఆదివారం ఉదయం 9 గంటలకు ఎంజీఎం హాస్పిటల్ శ్రీకాళహస్తి ఆధ్వర్యంలో జరిగిన ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. వైద్యులు వివేక్‌చైతన్య, అర్చన, ఉమమహేశ్వర్, రాజశేఖర్‌లు 150 మందికి ఉచితంగా వైద్య పరీక్షలు చేసి, మందులు పంపిణీ చేశారు. కొంతమంది రోగులను ఆపరేషన్ల కోసం సిఫార్సు చేశారు. ముఖ్యంగా గుండె, కిడ్నీ, యూరినరీ, సాధారణ జబ్బులకు ఉచితంగా మందులు ఇచ్చారు. ఎంజీఎం హాస్పిటల్ శ్రీకాళహస్తిలో ఎన్టీఆర్ ఆరోగ్యశ్రీ వైద్యసేవ ద్వారా ఉచితంగా ప్రజలకు వైద్యం అందిస్తున్నామని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని డైరెక్టర్ మయూర్ తెలిపారు.

శేషవాహనంపై కుమారస్వామి


శేషవాహనంపై ఊరేగుతున్న కుమారస్వామి


యాళివాహనంపై స్వామి వారు

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయానికి అనుబంధంగా విజ్ఞానగిరిపై ఉన్న శ్రీవల్లి దేవసేన సమేత కుమారస్వామి ఆదివారం రాత్రి శేషవాహనంపై ఊరేగారు. మొదట ఆలయంలోని అలంకార మండపంలో విశేష పూజలు నిర్వహించి, ప్రత్యేకంగా అలంకరించారు. ధూపదీప నైవేద్యాలు సమర్పించారు. అనంతరం శేషవాహనంపై కొలువుదీర్చి, పురవీధుల్లో ఊరేగుతున్న స్వామివారిని దర్శించుకోవడానికి భక్తులు బారులు తీరారు. కర్పూర నీరాజనాలు సమర్పించి, మొక్కులు తీర్చుకున్నారు.

యాళి వాహనంపై కుమారస్వామి చిద్విలాసం

శ్రీవల్లి దేవసేన సమేత కుమారస్వామి ఆదివారం యాళి వాహనంపై ఊ రేగారు. ఆడికృత్తిక ఉత్సవాలను పురస్కరించుకుని ఆదివారం స్వామి అమ్మవార్లను ఆలయ అలంకార మండపంలో అభిషేకాలు నిర్వహించారు. అనంతరం విశేషంగా అలంకరించి, ధూపదీప నైవేద్యాలు సమర్పించారు. వేదమంత్రాలు, మంగళవాయిద్యాలు నడుమ స్వామి అమ్మవార్లను యాళి వాహనంపై పురవీధుల్లో ఊరేగించారు. ఈఓ ఎన్‌వీఎస్‌ఎన్ మూర్తి పాల్గొన్నారు.

చౌర్యం.. చార్జింగ్..!



నవ్విపోదురుగానీ.. మాకేంటి అన్నట్టు కొందరు ఉద్యోగులు నడుచుకుంటున్నారు. నగరపాలక కార్యాలయంలో యథేచ్ఛగా విద్యుత్ చౌర్యానికి పాల్పడుతున్నారు. తమ ఎలక్ట్రిక్ స్కూటర్లకు ఎలాంటి అనుమతులు లేకుండా చార్జింగ్ పెట్టుకుంటున్నారు. అక్రమంగా కరెంట్ వాడేస్తున్నారు. ఈ విషయం తెలిసినా అధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారు. – సాక్షి ఫొటోగ్రాఫర్, తిరుపతి

కరెంటు రాదు.. జనరేటర్ పెట్టుకోండి

నాగలాపురం: ఇప్పటికి విద్యుత్ సరఫరా రాదు.. కావాలంటే జనరేటర్ పెట్టుకోండని ట్రాన్స్‌కో ఏఈ నిర్లక్ష్యంగా సమాధానం చెప్పడంతో ప్రముఖులే ఖంగు తిన్నారు. వివరాల్లోకి వెళితే.. పిచ్చాటూరు మండలంలోని రామగిరిలో శ్రీవల్లి దేవసేన సమేత ముత్తుకుమార స్వామి ఆలయంలో భరణి కృత్తిక వేడుకను వైభవంగా నిర్వహిస్తున్నారు. ఈ ఉత్సవాలకు వేల సంఖ్యలో భక్తులు తరలి వచ్చారు. ఉదయం నుంచి స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం 8 గంటల వరకు దాదాపు 5 గంటల సేపు విద్యుత్ లేకపోవడంతో భక్తులు ఆలయ ప్రాంగణలో ఇబ్బందులకు గురయ్యారు. భక్తుల ఇబ్బందులను గుర్తించిన ఆలయ మాజీ చైర్మన్ స్పందించి, పిచ్చాటూరు ఏఈకి ఫోన్ చేసి, విద్యుత్ ఎప్పుడు వస్తుంది అని అడిగారు. దీంతో ఏఈ 'ఇప్పటికి రాదు.. కావాలంటే జనరేటర్ పెట్టుకోండి.' అని నిర్లక్షంగా సమాధానం ఇచ్చారు. సంవత్సరంలో ఆడినెలలో ఈ ఉత్సవాలు జరుగుతాయని తెలిసినా. ఇంత అజాగ్రత్తగా, ఒక ప్రభుత్వ అధికారి ఇలా సమాధానం ఇవ్వడంతో స్వామి వారి సేవలో పాల్గొన్న ఉభయకర్తలు, భక్తులు, ఆలయ సిబ్బంది విద్యుత్ అధికారుల నిర్లక్ష్యంపై మండిపడ్డారు.

నేడు గంగమ్మ ఆలయంలో లీజు వేలం

తిరుపతి కల్చరల్ : తాతయ్యగుంట గంగమ్మ ఆలయంలో సోమవారం ఉదయం 11 గంటలకు వివిధ పనుల లీజు కోసం బహిరంగ వేలం పాట నిర్వహిస్తున్నట్లు ఈఓ మమత తెలిపారు. ఆదివారం ఆమె మాట్లాడుతూ అమ్మవారికి భక్తులు సమర్పించే చీరలు, రవిక పీసులు సేకరణ లీజు హక్కు నిమిత్తం హిందూ దేవదాయ శాఖ అధికారుల సమక్షంలో వేలం పాట ఉంటుందని పేర్కొన్నారు. 2024 జూలై 29 నుంచి 2025 జూలై 28వ తేదీ వరకు పనుల లీజు హక్కు ఉంటుందని వెల్లడించారు. వివరాలకు ఆలయ కార్యాలయంలో సంప్రదించాలని సూచించారు.

369 మందికి వైద్య పరీక్షలు


వైద్యశిబిరానికి హాజరైన స్థానికులు

- ఉచితంగా మందుల పంపిణీ

శ్రీసిటీ(వరదయ్యపాళెం): శ్రీరామచంద్రా మెడికల్ సెంటర్, శ్రీసిటీ ఫౌండేషన్, శ్రీ కోదండరామ స్వామి సేవా సంఘం వారు సంయుక్తంగా వరదయ్యపాళెం జిల్లా పరిషత్ హైస్కూల్ ఆవరణలో ఆదివారం నిర్వహించిన ఉచిత మెగా వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. చెన్నై శ్రీరామచంద్రా హాస్పిటల్‌కు చెందిన ప్రత్యేక వైద్య నిపుణుల బృందం ఈ శిబిరంలో పాల్గొని వైద్య సేవలు అందించారు. ఉదయం 8 నుంచి సాయంత్రం 4 గంటల వరకు కొనసాగిన ఉచిత వైద్య శిబిరంలో 369 మందికి వివిధ రకాల వైద్య చికిత్సలు చేపట్టి, ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ శిబిరంలో శ్రీరామచంద్రా మెడికల్ సెంటర్‌కు చెందిన జనరల్ ఫిజీషియన్, గైనకాలజీ, డెర్మటాలజీ, పిడియాట్రిక్స్, ఆర్థోపెడిక్స్‌కు సంబంధించి ప్రత్యేక వైద్యనిపుణుల బృందం పాల్గొని, వైద్యసేవలు అందించారు. శ్రీ కోదండ రామస్వామి సేవా సంఘం నిర్వాహకులు పరంధామరెడ్డి, శ్రీనివాసులు రెడ్డి, శ్రీసిటీ ఫౌండేషన్ సీనియర్ మేనేజర్ సురేంద్ర కుమార్ ఏర్పాట్లను పర్యవేక్షించారు. స్థానిక జిల్లా పరిషత్ హైస్కూల్ ఉపాధ్యాయులు, ఎన్‌సీసీ విద్యార్థులు కార్యక్రమంలో పాల్గొని వైద్య కోసం వచ్చిన వారికి సహాయ సహకారాలను అందజేశారు.


ఉచిత వైద్య శిబిరంలో రోగులకు మందులను అందజేస్తున్న నిర్వాహకులు


వరదయ్యపాళెంలో జరిగిన ఉచిత వైద్య శిబిరంలో రోగులను పరీక్షిస్తున్న వైద్యులు




విజ్ఞానగిరిపై విద్యుద్దీపాలంకరణ

ఆడికృత్తికకు ఏర్పాట్లు పూర్తి



శ్రీకాళహస్తిలో ఆడికృత్తిక బ్రహ్మోత్సవాలకు ఏర్పాట్లు పూర్తి అయ్యాయి. తమిళంలో ఆడిమాసంలో వచ్చే ఆడికృత్తిక సందర్భంగా ఆరురోజుల పాటు ఉత్సవాలు నిర్వహిస్తారు. ఇందులో భాగంగా పట్టణంలోని విజ్ఞానగిరిపై ఉన్న ఆలయంలో ఆడికృత్తిక ఉత్సవాలు నిర్వహిస్తున్నారు. ఇందుకోసం కోనేరులో తెప్పోత్సవం కోసం నీటిని నింపి, కల్యాణకట్టను ఏర్పాటు చేశారు. కొండపై క్యూలు ఏర్పాటు చేశారు. దేవతామూర్తుల కటౌట్లు, విద్యుత్ దీపాలంకరణ చేశారు. –శ్రీకాళహస్తి